# మీ హృదయమే రామ మందిరం

**చక్కెరకంటె తీపి దధిసారముకంటెను రుచ్యమౌను పెం**
**పెక్కిన తేనెకన్న అతిరుచ్యము నోటను పల్కపల్కగా**
**మిక్కిలి కమ్మనౌ అమృతమే యనిపించునుగాన మీరు ఈ**
**చక్కనిదాని మనసా స్మరియింపుడు రామనామమున్**

త్రేతాయుగము గడచిపోయి అనేక వేల సంవత్సరములైంది. ఇన్ని సంవత్సరములు గడచినప్పటికినీ నేటికీ బాలలు మొదలుకొని వృద్ధులవరకు ప్రతి ఒక్కరు రామనామమును స్మరిస్తూ ఉన్నారంటే ఇది ఎంత గొప్ప మహిమ గలిగినదో అందరూ గుర్తించాలి. 'రామ' అనేది దేహమునకు పెట్టిన పేరు మాత్రమేగాని దేహము రాముడు కాదు. ఆత్మయే రాముడు. అతని పేరు ఆత్మారాముడు. కాబట్టి, అతని పేరు స్మరించేవారికి ఎప్పటికైనను, ఏనాటికైనను ఇంట, వెంట, జంట, కంట ఉంటాడు.

ప్రేమస్వరూపులారా! 'రామా' అన్నా, హృదయమన్నా, ఆత్మ అన్నా అంతా ఒక్కటే! ప్రతి సంవత్సరముకూడను రామనవమి పండుగ వస్తూనే ఉన్నది. కాని, మనము ఎంతవరకు దీని విశిష్టతను తెలుసుకున్నామో గుర్తించాలి. మీరు 'రామా' అంటే కేవలం ఒక రూపాన్ని భావిస్తున్నారు. కాని, రాముడనగా ఒక రూపము కాదు. హృదయమునకే 'రామ' అని పేరు. ఇట్టి నామమును ఎవ్వరుకూడను ఏనాటికినీ మార్చలేరు. జగత్తులో ఎన్నియో మారుచున్నవి. అన్నీ కదలి పోవుచున్నవి. కాని, రామనామము నిత్యమై, సత్యమై, నిర్మలమై నిలిచియున్నది. రాముడు సామాన్య మానవుడు కాదు, జగత్కల్యాణము నిమిత్తమై అవతరించిన పరమాత్మయే! కొందరు 'రామా'యని, కొందరు 'కృష్ణా'యని, కొందరు 'ఈశ్వరా'యని, కొందరు 'మహాదేవా'యని ఈవిధంగా భగవంతునికి అనేక పేర్లు పెడుతున్నారు. ఈ అన్ని నామములుకూడను ఒకే భగవంతునికి సంబంధించినవే! ఈ

sri sathyasai vachanamrutam

దివ్య నామములయొక్క మహిమను మనము చక్కగా గుర్తించాలి. వసిష్ఠుడు చెప్పాడు, "రామో విగ్రహవాన్ ధర్మః". ధర్మస్వరూపమే రాముని స్వరూపము ధరించినది. ధర్మమును మనం అనుసరించాలి. ఏమిటా ధర్మము? హృదయమునకు సంబంధించిన తత్త్వమే ధర్మము. మనస్సుకు తోచినట్లుగా పోకూడదు.

**దేహభ్రాంతి లేనటువంటిది 'వైదేహి'**

ధర్మస్వరూపుడైన రామునికి సీత తోడు వచ్చింది. సీత ఎక్కడ పుట్టింది? ఆమె భూగర్భములో పుట్టింది. జనకుడు ఒక యజ్ఞము నిమిత్తం భూమిని దున్నుతూ ఉండగా ఆ భూగర్భమునుండి ఒక పెట్టె లభించింది. అది తెరచి చూస్తే అందులో ఒక చంటిబిడ్డ ఉంది. 'ఇది నాకు భగవంతుని వరప్రసాదము' అని భావించి జనకుడు ఆ చంటిబిడ్డను తన ఇంటికి తీసికొనివచ్చి 'సీత' అని పేరు పెట్టి అల్లారుముద్దుగా సాకుతూ వచ్చాడు. సీత విదేహ రాజు పుత్రిక కాబట్టి, ఆమెకు 'వైదేహి' అని కూడా పేరు వచ్చింది. 'వైదేహి' అనగా దేహభ్రాంతి లేనటువంటిది. ఇది చాలా ప్రధానమైనటువంటి పేరు.

**శివధనుర్భంగము**

జనకుని గృహంలో ఒక పెట్టె ఉన్నది. అందులో ఒక పెద్ద శివధనుస్సు ఉన్నది. ఒకరోజున వైదేహి, మరి కొందరు పిల్లలు కలిసి బంతితో ఆడుకుంటూ ఉండగా బంతి ఆ పెట్టె క్రిందికి పోయింది. ఆ పెట్టెను ప్రక్కకి జరపడానికి ఎవ్వరికీ సాధ్యం కాలేదు. సీత వెళ్ళి తన ఎడమచేతితో దానిని ప్రక్కకి జరిపి బంతిని బయటికి తీసింది. ఆ దృశ్యాన్ని చూసిన జనకుడు ఆనాడే సంకల్పించుకున్నాడు, సీతయొక్క శక్తి సామర్థ్యములు ప్రపంచానికి చాటాలని. తరువాత తాను ఒక యజ్ఞము తలపెట్టి, శివధనుస్సును ఎవరైతే ఎక్కుపెట్టగలరో వారికి సీతనిచ్చి పెండ్లి చేస్తానని ప్రకటించాడు. "జనక మహారాజు కుమార్తె చాలా గొప్పది. జనక మహారాజంతటివానికి అల్లుడు కావడం గొప్ప అదృష్టం" అని భావించి అన్ని దేశములయొక్క రాజులుకూడను అక్కడికి వచ్చారు. ఒకరి తరువాత ఒకరు వరుసగా వచ్చి శివధనుస్సును ఎత్తడానికి ప్రయత్నం చేశారు. కాని, ఎవ్వరికీ సాధ్యం కాలేదు. విశ్వామిత్రునివెంట వచ్చిన రామలక్ష్మణులు కూడా ఆ సభలో ఉన్నారు. విశ్వామిత్రుని

sri sathyasai vachanamrutam

సూచన మేరకు రాముడు ముందుకు వెళ్ళాడు. అతని మాటలు, ఆటలు, పాటలు అన్నీ మృదుమధురమైనటువంటివి. ప్రజలు మెచ్చేటట్లుగా తాను ఎంతో వినయముతో నడుచుకుంటూ ఆ పెట్టెదగ్గరకు వెళ్ళి శివధనుస్సును ఎడమ చేతితో ఎత్తాడు. అది అసాధ్యమని భావించా రందరూ. కాని, రామునికి సాధ్యము కానిదేమున్నది! తన సంకల్పమాత్రముచేత దేనినైనను సాధించగలడు. ఆ ధనుస్సును ఎడమ చేతితోనే వంచాడు. తక్షణమే అది పెద్ద శబ్దం చేస్తూ విరిగిపోయింది. అందరూ కరతాళ ధ్వనులు చేశారు. అప్పుడు విశ్వామిత్రుడు రామునిదగ్గరకు వెళ్ళి, "రామా! ఈనాడు నీ దివ్యత్వమునకు తగిన శక్తిని నీవు ప్రదర్శించావు. ఇది దైవశక్తియేగాని మానవశక్తి కాదు", అని కీర్తించాడు. అందరూ వచ్చి రాముని గొప్పగా వర్ణించి, అతనికి పూలమాలలు వేయసాగారు. అప్పుడు జనకుడు సీతను తీసుకు వచ్చాడు. కాని, రాముడు అటువైపు చూడనైనా చూడలేదు. ఎందుకంటే, తల్లిదండ్రుల ఆజ్ఞ లేకుండా ఆమెను చూడకూడదని అతని ఉద్దేశ్యం.

**సీతారామ కల్యాణం**

జనక మహారాజు అయోధ్యకు ఈ శుభవర్తమానం పంపించాడు. పెండ్లి ముహూర్తం నిర్ణయించి అందరూ రావలసిందిగా కోరాడు. "మీ కుమారుడు నేను పెట్టిన పోటీలో విజయం సాధించాడు. కాబట్టి, మీరందరు కూడను సీతారాముల వివాహ మహోత్సవానికి సిద్ధమై రావాలి", అని కోరాడు. సీతారాముల కల్యాణమునకు స్త్రీలందరూ ఆనందంగా పాటలు పాడుకుంటూ బయలుదేరారు.

**రారే చూడగ పోదాము రాముని పెండ్లి**
**రారే చూడగ పోదాము రమణులందరు కూడి**
**వింతల బంగళాలు, ముత్యపు తోరణాలు**
**మూలల కిటికీలు, వజ్రాల తలుపూలు**
**తాపిన నీలాలు, నీలాలు వెయ్యార్లు నూరార్లు బజార్లు ॥రారే॥**

ఈవిధంగా ఒకవైపున స్త్రీలు తరలి వస్తుంటే, మరొకవైపున పురుషులు పాడుకుంటూ వస్తున్నారు.

srisathyasaivacharamrutam

**కౌసల్యా తనయుని కల్యాణము చూతము రారండి!**
**అయోధ్యావాసుని కల్యాణము చూతము రారండి**
**చూచువారలకు చాల పుణ్యమట**
**పుణ్యపురుషులకు ధన్యభాగ్యమట ॥కల్యాణము॥**

అయోధ్య అంతా కదలి వచ్చిందా అనిపించేటట్లు దశరథుడు, అతని రాణులు, భరత శత్రుఘ్నులు, మంత్రులు అందరూ ఆనందోత్సాహాలతో తరలివచ్చారు. జనకుడు సకల రాజలాంఛనాలతో వారికి స్వాగతం పలికి గౌరవ, మర్యాదలు చేశాడు.

జనకుని రెండవ కుమార్తె పేరు ఊర్మిళ. ఆయన తమ్మునికి మాండవి, శ్రుతకీర్తి అని ఇరువురు బిడ్డలు. ఊర్మిళను లక్ష్మణునికి, మాండవిని భరతునికి, శ్రుతకీర్తిని శతృఘ్నునికి ఇచ్చి వివాహం జరిపించాలని నిర్ణయించారు. 'నలుగురం ఒకేతూరి పుట్టాము. కాబట్టి, నలుగురి వివాహాలు ఒకేతూరి జరగాలి' అని రాముడు కోరాడు. అందరూ వారివారి స్థానములలో ఆసీనులయ్యారు. కల్యాణ మహోత్సవం ప్రారంభమైంది. రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులు, వారి ఎదుట వరుసగా సీత, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తి నిలుచున్నారు. మొట్టమొదట సీత రాముని మెడలో మాల వేయాలి. రాముడు ఆజానుబాహుడు. సీత కొంచెం పొట్టిది. రాముడు ఆమెముందు తల వంచడం లేదు. ఎంత ప్రయత్నించినా సీతకు రాముని మెడలో మాల వేయడం సాధ్యం కావడంలేదు. అప్పుడు లక్ష్మణుడు ఒక యుక్తిని పన్నాడు. తాను రాముని పాదాలకు సాష్టాంగ నమస్కారం చేశాడు. అతనిని లేవనెత్తడానికి రాముడు ముందుకు వంగేసరికి తక్షణమే సీత రాముని మెడలో మాల వేసింది. ఆ తరువాత మిగిలిన ముగ్గురు పెళ్ళి కుమార్తెలు, పెళ్ళి కుమారుల కంఠసీమలను పూల మాలలతో అలంకరించారు. ప్రజలందరూ ఆనందంతో జయజయధ్వానాలు చేశారు.

**'మంచి, చెడ్డలు రెండును కలసియుండు'**

రామునియొక్క చర్యలు, లీలలు, వైభవాలను వర్ణించుటకు వీలుకాదు. కల్యాణ మహోత్సవము తరువాత అందరూ అయోధ్యకు బయలుదేరారు. మార్గమధ్యంలో ఒక పెద్ద

sri sathyasai vahanamrutam

శబ్దము వచ్చింది. ఎక్కడినుండి వచ్చిందీ శబ్దము అని పరికించి చూడగా పరశురాముడు మహోగ్రరూపం దాల్చి వస్తున్నాడు. "ఇంత వైభవముగా వివాహ మహోత్సవము జరిగిన తరువాత మధ్యలో ఈ అవాంతరమేమిటి?" వారు కలవరపడ్డారు. మంచి, చెడులు రెండూ ఒకదాని కొకటి తోడుగా ఉంటాయి. మిథిలలో వారు ఎంత ఆనందమును అనుభవించారో అయోధ్యకు వెళ్ళే మార్గమధ్యంలో అంత కష్టాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. దశరథుడు తదితరులు చాలా భయపడిపోయారు. పరశురాముడు దగ్గరకు వచ్చి, "శివుని ధనుస్సు విరిచిందెవరు?" అని ప్రశ్నించాడు. "నేనే" అన్నాడు, శ్రీరాముడు. "అట్లయితే నా ధనుస్సును విరుచు, చూద్దాం" అంటూ తన ధనుస్సును అతని చేతికిచ్చాడు. రాముడు దానినికూడా ఎడమచేతితో విరిచాడు. అప్పుడు పరశురాముడు రామునికి నమస్కరించి అక్కడినుండి వెళ్ళిపోయాడు. ఆ విజయోత్సాహంతో అందరూ అయోధ్యకు చేరారు.

**మంథరలాంటివారు ఎక్కడ చూసినా ఉంటారు**

రామునియొక్క శక్తి, సీతయొక్క భక్తి ఈ రెండింటినీ జగత్తునకు వ్యాప్తి గావించే నిమిత్తమై అయోధ్యలో ప్రజలు ఆనందంగా అనేక ఉత్సవాలు జరుపుకున్నారు. ఇదంతా చూసి మంథరకు అసూయ కలిగింది. ఈ లోకంలో మంథరలాంటివారు ఎక్కడ చూసినా ఉంటారు. కైక కుమారునికిస్తానన్న రాజ్యాన్ని దశరథుడు రామునికిస్తున్నాడే అనే కోపంచేత ఆమె రామునికి విరుద్ధంగా అనేక కట్టుకథలు కల్పించి కైకకు బాగా నూరిపోసింది. ఆమె చేసిన దుర్బోధలచేత కైకలో చాలా మార్పు వచ్చింది. మంథర కైకను ఒక కోరిక కోరింది. "అమ్మా! నేను నీ దాసిని. అయితే, నీవు పుట్టినప్పటినుండి నేనే నిన్ను పెంచి పోషించాను. నా చేతులమీదుగా పెరిగినటువంటి బిడ్డవు నీవు. నా ఒక్క చిన్న కోరికను నెరవేర్చు. రామునికి పట్టాభిషేకం చేయాలని దశరథ మహారాజు సంకల్పించాడు. కాని, ఆయన మొదలు నీకిచ్చిన మాట ప్రకారం భరతునికి పట్టం కట్టాలి; రాముని పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యానికి పంపించాలి", అని కోరింది. మహారాణి అయిన కైక ఒక సర్వెంటు మాటలకు లొంగిపోయి రాముని వనవాసానికి కారకురాలైంది. తరువాత 'ఇది మంథర చేసిన కుట్ర' అని గుర్తించి ఆమె పశ్చాత్తాపపడింది. అసలు కైకకు రాములంటే

sri sathyasai vahamrutam

చాలా ప్రేమ. రామునికి సర్వవిద్యలను కైకయే నేర్పినది. రాములుకూడా కైకను తన తల్లి కౌసల్యకంటే ఎక్కువగా ప్రేమిస్తూ వచ్చాడు.

**శ్రీరాముని పితృవాక్య పరిపాలన**

పట్టాభిషేకం నిమిత్తం సీతారాములు ఇరువురూ పసుపు పచ్చని పట్టువస్త్రాలు ధరించి సిద్ధంగా ఉన్నారు. వారిద్దరికీ స్వాగతం పలకటానికి సభలో అందరూ కాచుకొని ఉన్నారు. ఈలోపల రాముడు నెమ్మదిగా కౌసల్యదగ్గరకు వెళ్ళి, "అమ్మా! నేను అరణ్యానికి బయల్దేరుతున్నాను. నాకు సెలవివ్వు", అన్నాడు. కౌసల్య నిర్ఘాంతపోయి, "ఎందుకు నాయనా? నీవు పట్టాభిషిక్తుడవు కావలసిన సమయంలో అరణ్యానికి వెళ్ళడమేమిటి!" అన్నది. "అమ్మా! నేను పద్నాలుగేళ్లు అరణ్యవాసం చేయాలని తండ్రిగారి ఆజ్ఞ" అన్నాడు. రాముడు పితృవాక్య పరిపాలనయే తనకు ప్రధానమని భావించాడు. "తండ్రి చేసిన వాగ్దానాన్ని నేను నిలబెట్టాలి" అన్నాడు. తల్లికి నమస్కారం చేసి సుమిత్రవద్దకు బయలుదేరాడు.

సుమిత్ర దశరథుని రెండవ భార్య. ఆ కాలములో రెండవ పెళ్ళి చేసుకోదల్చుకుంటే గవర్నమెంటు పర్మీషను అక్కర్లేదు. కాని, మొదటి భార్య పర్మీషను కావాలి. కాబట్టి, సుమిత్రను వివాహమాడటానికి ముందు దశరథుడు కౌసల్య అనుమతిని కోరాడు. "నాథా! మన రాజ్యానికి వారసుడు కావాలి కదా! మీకు నచ్చిన స్త్రీని మీరు వివాహమాడండి. నేనుకూడా తప్పకుండా ఆ వివాహములో పాల్గొంటాను", అన్నది కౌసల్య. దశరథునికి చాలా సంతోషం కలిగింది. "ఇంతటి అనుకూలవతులైన భార్యలుకూడా ఉంటారా ఈ లోకంలో!" అని ఆయన ఆశ్చర్యపోయాడు.

**సుమిత్ర సార్థక నామధేయురాలు**

సుమిత్ర చాలా గొప్ప గుణవంతురాలు. 'సు-మిత్ర' అన్న పేరుకు తగినట్లుగా ఆమె అందరిపట్ల మైత్రితో మెలగేది. సుమిత్ర కౌసల్య దగ్గరకు వచ్చి ఆమెను ఓదార్చుతూ, "అక్కా! నీవెందుకు బాధపడుతున్నావు? రాముడు ఎవరనుకున్నావు? సాక్షాత్తు

sri sathyasai vachanamrutam

శ్రీమన్నారాయణమూర్తియే! అతను అయోధ్యలో ఉంటే యేమి! అరణ్యమునకు వెళితేనేమి! ఎక్కడుండినా మనవెంటనే ఉన్నాడు. రామునికి అయోధ్య, అరణ్యము రెండూ ఒక్కటే!" అన్నది. సుమిత్ర మాటలు విన్న తరువాత కౌసల్యకు కొంత ధైర్యం వచ్చింది. ఆమె మనస్సుకు శాంతి చేకూరింది. సుమిత్ర చెప్పింది, "అక్కా! నీకు, కైకేయికి ఒక్కొక్క కుమారుడు కలిగితే నాకు ఇరువురు కుమారులు పుట్టారు. కారణమేమిటో తెలుసా? రామునికి లక్ష్మణుడు సేవ చేయాలి. భరతునికి శతృఘ్నుడు సేవ చేయాలి. రామునికి, భరతునికి సేవలు చేసే నిమిత్తమే నేను ఇద్దరు కుమారులను కన్నాను. కాబట్టి, నా సంకల్పము చక్కగా నెరవేరనిమ్ము. లక్ష్మణుడు సీతారాములవెంట అరణ్యానికి వెళ్ళి వారిని కంటికి రెప్పవలె కాపాడుతాడు. కాబట్టి, నీవేమీ భయపడనక్కర్లేదు."

**ఊర్మిళ త్యాగనిరతి**

లక్ష్మణుడు అరణ్యానికి బయల్దేరేముందు తన భార్య ఊర్మిళవద్దకు వెళ్ళాడు. సీతారామలక్ష్మణులు అరణ్యానికి బయల్దేరుతున్న సంగతి అప్పటికింకా ఊర్మిళకు తెలియదు. ఆమె తన గదిలో కూర్చుని సీతారామ పట్టాభిషేక దృశ్యాన్ని 'పెయింట్' వేస్తున్నది. ఆ సమయంలో లక్ష్మణుడు వెళ్ళి, "ఊర్మిళా!" అని పిలిచాడు. 'ఏమిటి స్వామీ!' అంటూ ఆమె లేచి నిలబడింది. ఆమె లేచే సమయంలో అక్కడున్న పెయింటు పొరపాటున ఆమె గీసిన చిత్రముపై ఒలికిపోయింది. "అయ్యో, ఎంతో అందంగా గీసినటువంటి చిత్రము పాడైపోయిందే!' అని బాధపడింది. అప్పుడు లక్ష్మణుడు చెప్పాడు: "ఊర్మిళా! లోక కళ్యాణమును చేకూర్చే శ్రీరామ పట్టాభిషేకమును కైకేయి చెడగొట్టింది. నీవు గీసిన చిత్రమును నేను చెడగొట్టాను. దీనిగురించి నీవు బాధపడనక్కర్లేదు. నేను రామునివెంట అరణ్యానికి వెళుతున్నాను", అని చెప్పాడు. ఆమె చాలా భయపడిపోయింది. "రాముడు అరణ్యానికి పోవడమేమిటి! కొన్ని క్షణాలలోపల అతనికి పట్టాభిషేకము జరుగనున్నది కదా!" అన్నది. అప్పుడు లక్ష్మణుడు ఆమెకు జరిగిన సంగతి వివరించాడు. ఊర్మిళ గొప్ప త్యాగగుణము కలిగినది. తన భర్త తనను విడిచిపెట్టి వెళుతున్నాడని ఆమె విచారించలేదు. అతనికి సీతారాముల సేవచేసే అవకాశం లభించినందుకు ఎంతో ఆనందించింది.

srisathyasaivacharamrutam

"సీతారాముల సేవలో మీ కాలాన్ని సార్థకం గావించుకోండి. మాకెవ్వరికీ అట్టి భాగ్యము లభించలేదు. మీరు ఆనందంగా వెళ్ళి రండి" అని చెప్పి నమస్కరించి లక్ష్మణుని పంపించింది.

జనకుడు తన కుమార్తెతో, "సీతా! నీవు రామునివెంట అరణ్యానికి వెళుతున్నావట. అరణ్యంలో అనేక క్రూరమృగములు సంచరిస్తుంటాయి. భయంకరమైన శబ్దాలు వినిపిస్తుంటాయి. నీవు వాటిని తట్టుకొని నిర్భయంగా ఉండగలవా?" అని ప్రశ్నించాడు. "పురుషసింహమైన రాముడు నావెంట ఉండగా ఏ మృగములు వస్తే నాకేమి భయం! రాముడు సాక్షాత్తు నారాయణమూర్తియే! కాబట్టి, మనము ఎవరికీ భయపడనక్కర్లేదు" అని సీత సమాధానమిచ్చింది. ఈరీతిగా అందరికీ ధైర్యం చెప్పి సీతారామలక్ష్మణులు అరణ్యానికి వెళ్ళారు. అరణ్యంలో లక్ష్మణుడు సీతారాములను కంటికి రెప్పవలె చూసుకొంటూ వారికెంతో సేవ చేస్తూ వచ్చాడు.

రావణ సంహారము గావించి సీతను వెంటపెట్టుకొని రాముడు తిరిగి వచ్చినప్పుడు అయోధ్యా ప్రజలు ఆనందంతో జయజయధ్వానాలు సల్పుతూ వారికి స్వాగతం పలికారు. "రామచంద్రుడు వచ్చాడు. సీతమ్మ తల్లితో వచ్చాడు. మన అయోధ్యకు ఈనాడు వెలుగు వచ్చింది. శ్రీమన్నారాయణమూర్తి, లక్ష్మీదేవి ఇరువురూ కలిసి వచ్చిన ఈ దినమెంతో సుదినము" అని అయోధ్యావాసులు పండుగ జరుపుకున్నారు. సాక్షాత్తు నారాయణమూర్తి లక్ష్మీదేవితోకూడి దర్శన మిచ్చినప్పుడు ఎంత ఆనందంగా ఉంటుంది!

**ఇది రామరాజ్యము, ఇది ప్రేమరాజ్యము**

ఈ రాజ్యాన్ని మీరు రామరాజ్యంగా మార్చండి. రామరాజ్యంలో అందరూ సుఖంగా ఉండాలి. రాముడు లేని రాజ్యము రాక్షస రాజ్యము. ఈనాడుకూడా మన భారతదేశములో ప్రతి పల్లెయందు, ప్రతి గుడిసె యందుకూడను రాముని చిత్రపటము పెట్టుకొని పూజిస్తుంటారు. పిల్లలకు 'రామ' అని, 'సీత' అని పేర్లు పెడుతుంటారు. కొన్ని వేల సంవత్సరములు గడచి పోయినప్పటికీ ఈనాటివరకు 'సీత', 'రామ' అనే నామములు

sri sathyasai vachanamrutam

ఏమాత్రము మారలేదు; మారవు. అనేక రాజ్యములలో అనేక యుద్ధములు జరిగినాయి. కాని, మన భారతదేశములో ఏనాడుకూడను యుద్ధము జరుగదు, జరుగబోదు. ఇది రామరాజ్యము. ఇది ప్రేమరాజ్యము. ఇది శాంతి రాజ్యము.

**గతజీవుడగు పతిన్ బ్రతికించుకొన్నట్టి**
**సావిత్రి భారత సతియె కాదె**
**తన సత్యమహిమచే దావాగ్ని చల్లార్చె**
**చంద్రమతి పవిత్ర పడతి కాదె**
**కుల సతీత్వమును అగ్నిగుండాన ప్రకటించె**
**సీత భారతధరాజాత గాదె**
**కినిసి దుర్మద కిరాతుని బూది గావించె**
**దమయంతి భారత రమణి కాదె**

ఇలాంటి మహాతల్లులు ఉండటంచేతనే ఈనాటివరకు భారతదేశము నిత్యకల్యాణము, పచ్చతోరణముగా ప్రకాశిస్తున్నది. మీకు తెలుసు – భార్య మరణిస్తే మగవారు వెంటనే రెండవ పెళ్ళికి ప్రయత్నం చేస్తుంటారు. కాని, స్త్రీలలో అలాంటివారు లేరు. అనాది కాలమునుండి భారతదేశము అన్ని దేశములకు ఉపాధ్యాయ స్థానంలో ఉన్నటువంటిది. కనుకనే, భారతదేశములో శ్రీమన్నారాయణుడు పుట్టి, అనేక లీలలను, మహిమలను చూపి, ప్రతి జీవిని కూడను ఉద్ధరిస్తూ వచ్చాడు.

ప్రతి మానవుడుకూడను ఆత్మయొక్క ప్రతిబింబమే! కనుకనే, శ్రీకృష్ణుడు చెప్పాడు – "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః". మీరందరుకూడను రామస్వరూపులే! మీ రూపనామములు వేరువేరుగా ఉండవచ్చును. కాని, మీ అందరియందుకూడను ఆత్మారాముడు ఒక్కడే ఉన్నాడు. కనుక, రాముడు ఎక్కడో ఉన్నాడని మీరు యోచించకండి. మీ హృదయమే రామునియొక్క మందిరము. కాబట్టి, మీ హృదయంలో ఉన్న రాముని మీరు నిరంతరము స్మరిస్తూ ఉండండి. జాగ్రదవస్థలోగాని, స్వప్నావస్థలోగాని, సుషుప్తిలోగాని ఎప్పుడుకూడను రాముడు మీ ఇంటనే, వెంటనే, జంటనే, కంటనే ఉన్నాడు. రాముడనగా

sri sathyasai vachanamrutam

ఒక ప్రత్యేకమైన వ్యక్తిస్వరూపుడు కాదు. తాను అనేక రూపాలను ధరిస్తుంటాడు. రూపములు వేరువేరైనప్పటికీ దివ్యత్వం ఒక్కటే! కాబట్టి, మీరు ఎవరిని చూసినప్పటికీ సాక్షాత్తు శ్రీరాముడినే చూచినట్లుగా భావించి నమస్కరించాలి. ఈనాడు అట్టి ధర్మమును, అట్టి ప్రేమను, అట్టి శాంతిని ప్రకటిస్తూ ఉన్నాడు కనుకనే స్వామిని 'సాయిరామా', 'సాయికృష్ణా' అని పిలుస్తూ వస్తున్నారు. ప్రతి వ్యక్తికూడను రాముడే! అందరుకూడను ఈశ్వరులే! నీలోనే ఉన్నాడు రాముడు. నీవే రాముడవు. ఇట్టి సత్యాన్ని మీరు హృదయంలో ప్రతిష్ఠ చేసుకొని కాలమును సార్థకం గావించుకోండి. మీ జీవితమంతా నిత్యానందంగా ఉంటుంటాది. రామనామాన్ని నిరంతరం స్మరిస్తూ రండి.

**రామా కోదండరామా రామా పట్టాభిరామా**
**రామా కల్యాణ రామా రాఘవా!**
**రామా నీదొక్క మాట రామా నాకొక్క మాట**
**రామా నీ పాటే పాట రామా నీ బాటే బాట.**
**రామా నీకెవరు తోడు రామా నీ కంట చూడు**
**రామా నేను నీ వాడు రామా నాతో మాటాడు.**
**రామా నీ నామమే మేలు**
**రామా నీ చింతనే చాలు**
**నీ నామమే మేలు నీ చింతనే చాలు**

ఎన్ని సంవత్సరములు గడిచినప్పటికీ, ఎన్ని యుగములు మారినప్పటికీ రామనామమును మాత్రం ఎప్పటికీ మరువకూడదు. రాముడు నిన్ను వదలి ఉండలేడు. నీవు రాముని వదలి ఉండలేవు. నీవు ఎవరిని ఏ పేరుతో పిలిచినప్పటికీ ఆ వ్యక్తిలో ఉన్నది రాముడే! 'సాయిరామా' అనండి, 'సీతారామా' అనండి, 'అయోధ్యరామా' అనండి. ఏ పేరుతోనైనా పిలువవచ్చు. రామనామాన్ని నిరంతరము స్మరిస్తూ రండి.

**(శ్రీరామ నవమి, తేదీ 27.03.2007, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vachanamrutam